అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి


డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో పార్కు అభివృద్ధి పనులు చేపట్టాలని, పారిశుద్ధ్యం, కంపౌండ్‌వాల్ నిర్మాణం, కాలనీ ఆర్‌డబ్ల్యూఏపై వినతిపత్రంలో పేర్కొన్నారు.

నేటి నుంచి మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు

గౌతంనగర్: మహాశివరాత్రి సందర్భంగా గౌతంనగర్ మల్లికార్జున దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ధ్వజారోహణం, గణపతి అభిషేకం, శ్రీగణపతి సహిత మల్లికార్జునస్వామివారికి రుద్ర హోమం, రుద్రాభిషేకం, బుధవారం మహాశివ రాత్రి రోజున సామూహిక రుద్రాభిషేకం, పార్వతి పరమేశ్వరులకల్యాణం, పల్లకీసేవ, రాత్రి లింగోద్భవం మహాన్యాస రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

బోడుప్పల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రవాణ సౌకర్యార్థం కీసరగుట్ట రామలింగేశ్వర ఆలయానికి చెంగిచర్ల డిపోకు చెందిన బస్సులను నడుపుతున్నట్లు డీఎం కవిత వెల్లడించారు. చెంగిచర్లలో ఆమె మాట్లాడుతూ.. ఉప్పల్ చౌరస్తా నుంచి ఉప్పల్ బస్టాండ్, మేడిపల్లి, నారాపల్లి, అన్నోజిగూడ, ఘట్‌కేసర్ బస్టాండ్, కొండాపూర్, బోగారం మీదుగా కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఉప్పల్ బస్టాండ్, ఘట్‌కేసర్ బస్టాండ్‌ల వద్ద డిపోకు చెందిన సిబ్బంది ఉండి భక్తుల రద్దీని బట్టి మరిన్ని బస్సులను నడుపుతామన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

ఉప్పల్: రామంతాపూర్ ప్రాంతానికి చెందిన మనీషా ఆత్మహత్య కేసులో భర్త పులిగుజ్జు సంపత్‌ను ఉప్పల్ పోలీసుల సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను నిర్లక్ష్యం చేయడంతో పాటు అనేక రకాలు వేధింపులకు గురిచేసినందుకు అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

జాతరకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్: జాతరకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మంచాల విష్ణు, భార్య నవ్య, పిల్లలతో కలిసి బీబీనగర్ దేవాలయం జాతరకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో బంగారు చెవి కమ్మలు, 2 గ్రాముల చెవి దుద్దులు, రూ. 5 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మరో ఘటనలో..

గుత్తుల కమల అనే మహిళ భర్త అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పక్కింట్లో చోరీ చేసిన దుండగులు ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని చెవి కమ్మలు, ఉంగరం, వెండి పూజా సామగ్రితో పాటు రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా చెలరేగిన మంటలు

శామీర్‌పేట్: వంటగ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా మంటలు చెలరేగడంతో ఇళ్లు ధ్వంసమైన ఘటన సోమవారం సాయంత్రం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తూంకుంట మున్సిపాలిటీ, పోతాయిపల్లిలో తీగుళ్ల గోపాల్ ఇంట్లో అద్దెకు నివాసం ఉంటూ సమీపంలోని ఉన్న గ్యాస్ సిలిండర్ గోదామ్‌లో పనిచేస్తున్నారు. కాగా ఆదివారం సాయంత్రం వారు నివాసం ఉంటున్న ఇంట్లో డొమెస్టిక్ సిలిండర్ల నుంచి అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మద్యం మత్తు.. ప్రాణాలకు చేటు



జనావాసాల్లో బెల్టు షాపులు

- ఉదయం 3 గంటల నుంచి మద్యం విక్రయం
- పనిచేసే చోట ప్రమాదాలకు గురౌతున్న కార్మికులు

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో జనావాసాల మధ్య విచ్చల విడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. రోజంతా పనిచేసి సంపాదించిన కూలీ డబ్బులు మద్యం తాగేందుకు కార్మికులు ఖర్చు పెడుతూ అప్పుల పాలవుతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయనే పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి, పగలూ తేడా లేకుండా..

కొంతమంది రాత్రి, పగలూ తేడా లేకుండా మద్యం తాగుతూ కూలీ పనులకు కూడా వెళ్లడం లేదు. బెల్ట్ షాపులో ఎక్కువ శాతం తక్కువ ధర కలిగిన లిక్కర్‌ను విక్రయిస్తారు. దీన్ని తాగిన చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. లైసెన్స్ కలిగిన మద్యం షాపులో అమ్మకం ధరల కంటే దాదాపు రూ.40 నుంచి రూ.50 ఎక్కువ ధర వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి, మరుసటి రోజు నుంచే విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

జాతీయ సెలవు దినాల్లోనూ విక్రయాలు..

జాతీయ సెలవు దినాలైన గాంధీ జయంతి, ఇండిపెండెన్స్ డే, రిపబ్లిక్ డే, బోనాల పండుగతో పాటు సాధారణ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వం రెండ్రోజులు లైసెన్స్ ఉన్న వైన్‌షాపుల మూసివేతకు ఆదేశాలు ఇస్తారు. ఇలాంటి రోజుల్లోనే బెల్టు షాపులు 24 గంటలు తెరిచి ఉంచి మద్యం అమ్మకాలు ఏరులై పారుతాయి.

ఎక్కడెక్కడ...

రామంతాపూర్ పరిధిలోని లక్ష్మీనారాయణనగర్, ఉప్పల్ ఐడీఏ శ్రీనగర్ కాలనీ, బైపాస్ రోడ్డు, నెహ్రూనగర్, ఇందిరానగర్, దేవేందర్‌నగర్, కేసీఆర్‌నగర్, రాంరెడ్డినగర్, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు..

ఈ బెల్టు షాపులపై ఫిర్యాదు చేసిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం మద్యం అమ్మకాల టార్గెట్ పూర్తి కావాలంటే బెల్టు షాపులు ఉండాల్సిందే అన్నట్లుగా వాటి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బెల్టు షాపులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు..

ప్రభుత్వ లైసెన్స్ గల వైన్‌షాపులు, బార్లు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 11.30కు మూసి వేస్తారు. ఆ సమయంలోనే ఉదయం వైన్‌షాపులు తెరవని సమయాల్లో వేకువజామున ఉదయం 3 గంటల నుంచి 11 గంటల వరకు ఈ బెల్టు షాపుల్లో మద్యం సేవించి చాలా మంది భవన నిర్మాణ కార్మికులు అంబర్‌పేట్, గోల్నాక, చెంగిచర్లలో కబేళాలో పనిచేసే కార్మికులు స్థానిక పారిశ్రామికవాడల్లో ఉదయం షిఫ్టుకు వెళ్లే తాత్కాలిక కార్మికులు ఉదయం పూట మద్యం తాగి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.



అక్రమంగా మద్యం విక్రయించే దుకాణాలు మూసేయాలి..



రామంతాపూర్ ఉప్పల్ పరిధిలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే మూసి వేయాలి. 24 గంటలు ఈ బెల్టు షాపులు అందుబాటులో ఉండటంతో కొంతమంది తరుచూ మద్యం సేవిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు విధులకు హాజరై ప్రమాదాల పాలవుతున్నారు. అక్రమంగా విక్రయించే ఈ దుకాణాలను అధికారులు మూసివేయించకపోతే ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.

– సృజన, మేడ్చల్ జిల్లా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



కాప్రా: నాచారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజర్ సిరాజుద్దీన్‌కు స్థానిక నేత గద్ద క్రాంతి కిషోర్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎర్రకుంట ఎల్‌బీఎస్ కమ్యూనిటీ హాల్ వద్ద నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణంతో డ్రైనేజీ పైపులైన్ పగిలిపోయిందని, దీంతో ఇళ్ల ముందు మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉప్పల్: ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి 2007–2008 పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నెమరేసుకుంటూ చలోక్తులు విసురుకుంటూ సందడిగా గడిపారు. చాలామంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటంతో గురువులు వారిని అభినందించారు. పలువురు విద్యార్థులు గురువుల గొప్పతనం ఎంత చెప్పినా తక్కువేనన్నారు. పాఠశాల స్థాయి గురువులను జీవితాంతం గుర్తు పెట్టుకుంటారన్నారు.

ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి తాగునీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని 7 జేపీసీ కాలనీలో డ్రెయిన్ ఔట్‌లెట్ ఏర్పాటుతో పాటు నీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని, కొకూర్ జనప్రియ ఆర్కేడ్‌లోని 600 ప్లాట్లకు తాగునీటి కనెక్షన్లు పునరుద్ధరించాలని, ఫాదర్ బాలయ్యకాలనీలో బోర్లు వేయించాలని, మల్కాజిగిరి నియోజకవర్గానికి సరఫరా అయ్యే నీటిని కొంతమేరకు పారిశ్రామిక అవసరాలకు సరఫరా చేయడం మానుకోవాలన్నారు. గౌతంనగర్ వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్‌స్టేషన్ పునరుద్ధరించాలని కోరారు. కార్పొరేటర్ సునీత, నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, జగదీష్‌గౌడ్, రమేష్, అమీనుద్దీన్, లక్ష్మణ్‌యాదవ్, శరణగిరి, సందీప్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బస్తీవాసులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని యాదవనగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ యాదవనగర్ బస్తీవాసులు సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవికాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్‌వెల్ సమస్య కూడా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

జాతీయ సమగ్రత శిబిరానికి డిగ్రీ విద్యార్థిని ఎంపిక



అల్వాల్: మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శిరీషా భరంపుర విశ్వ విద్యాలయం ఒడిశాలో జాతీయ సమగ్రత శిబిరానికి ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు తెలిపారు. ఒడిశాలో మార్చి 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతీయ సమగ్రత శిబిరానికి తమ విద్యార్థిని ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జీఎస్. జగన్, డాక్టర్ ఈ. ప్రదీప్, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్‌కుమార్, అకడమిక్ కో–ఆర్డినేటర్ గుణకర్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ మల్లిక, శైలజ, డాక్టర్ లలిత, డాక్టర్ అహల్య పాల్గొన్నారు.

కీసర బ్రహ్మోత్సవాల్లో క్రీడా పోటీలు !


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శివసేనారెడ్డి

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కీసరగుట్ట దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని దేవాలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సుమారు రూ.కోటి వరకు నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు స్నేహపూరితమైన వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో భక్తులు, క్రీడాకారులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అనంతరం శివసేనారెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించారు.

ప్రజా దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచకూడదని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 64 ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన పురోగతిని ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.52 లక్షలతో సీసీరోడ్డు పనులు


పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఆర్‌కేనగర్‌లో రూ.52 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీలో ఇప్పటికే నిధుల విడుదల కష్టంగా మారిందని, ప్రజలకు ఇచ్చిన హామీల కారణంగా పోరాడి నిధులు తీసుకొస్తున్నామన్నారు. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో పనిచేయాలన్నారు. ఏఈ నవీన్ కాలనీ వాసులు శివానంద్, మధు, రాంబాబు, హరీష్, ఉపేందర్‌సింగ్, జయంతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి


అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

సాక్షి,సిటీబ్యూరో: జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ అధ్వర్యంలో జర్నలిస్టులు అందోళన చేపట్టారు. జర్నలిస్టులకు కొత్త ఆరోగ్యబీమా పథకాన్ని ప్రవేశపెటాలని, హెల్త్ కార్డు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులు ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టడంతో పాటు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రిపూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధుల బృందం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా నేతలు తన్నీరు శ్రీనివాసరావు, గుమ్మడి హరిప్రసాద్, అశోక్, రోజారాణి, పటేల్ నర్సింహులుయాదవ్, అశోక్, మల్లేష్‌గౌడ్, కృష్ణ, రామచంద్రమూర్తి, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్

మేడ్చల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్ ప్రారంభమైంది. సోమవారం ఎంఈవో రంగాచారి ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ అభివృద్ధికి పైలెట్ ప్రాజెక్ట్ కింద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ల్యాబ్ ద్వారా ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్‌తో చదవడం, రాయడం, పిల్లలకు నేర్పిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. హెచ్ఎం రాజిరెడ్డి, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: సమ్మర్ యాక్షన్ నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బాలాజీహిల్స్‌కాలనీ, పద్మావతికాలనీ, వెస్ట్ బాలాజీహిల్స్ కాలనీ, ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీ, స్వరూప్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మారుతినగర్ ఫీడర్ పరిధిలో ...

యాదవ బస్తీ, సుభాష్‌నగర్, ఎస్సీబస్తీ, మనసాని కాలనీ, బీఎల్‌నగర్, ఎస్‌బీఆర్ కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, న్యూ భవానీనగర్, లెక్చరర్స్ కాలనీ, శుభోదయ కాలనీ, మణికంఠనగర్, రాంరెడ్డినగర్, మారుతీనగర్, శ్రీసాయిఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ, యాదాద్రి కాలనీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ కృష్ణనగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కృష్ణనగర్, సూర్యనగర్, చంద్రనగర్, 11 కేవీ బాలాజీ రైస్‌మిల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు మచ్చబొల్లారం, లాల్‌రెడ్డి ఎన్‌క్లేవ్, సెలెక్ట్ టాకీస్, రుక్మిణి ఎన్‌క్లేవ్, అల్వాల్ సబ్‌స్టేషన్ 11కేవీ రీట్రీట్ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల వరకు సాయంత్రం 5 గంటల వరకు రీట్రీట్ కాలనీ, భవానీనగర్, వీబీఆర్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ కృపానంద్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు వెస్ట్ ఆనంద్‌బాగ్, కృపానంద్ అపార్ట్‌మెంట్, ఏడీఆర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

రామంతాపూర్ : ఉప్పల్ భగాయత్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హెచ్ఎండీఏ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ భగాయత్ కాలభైరవ టెంపుల్ టీఎస్ఆర్ లైన్ నారాయణ స్కూల్ లైన్ ఏజీఆర్ ప్రాజెక్టు లైన్, హెచ్ఎండీఏ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో మంగళవారం సైనిక్‌పురి సబ్‌స్టేషన్ పరిధిలో పలు కాలనీలకు సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. శ్రీనివాసనగర్, రుక్మిణిపురి, శ్రీనగర్, అరుల్‌కాలనీ, ఆదిత్యనగర్, గాంధీనగర్, విజయ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ఉచితంగా చికెన్ వంటకాల పంపిణీ


అల్వాల్ కానాజీగూడలో చికెన్ మేళా

అల్వాల్: పోషక పదార్థాలు ఉన్న కోడిమాంసంపై అపోహలు వీడాలని అల్వాల్ చికెన్‌షాపు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. సోమవారం అల్వాల్ కానాజీగూడలో చికెన్‌షాప్ ఓనర్స్ అసోసియేషన్, వెన్‌కాబ్ చికెన్ ఆధ్వర్యంలో ఉడకబెట్టిన గుడ్లను చికెన్ పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కోళ్ల ఫారాలలో బర్డ్‌ఫ్లూపై వస్తున్న వదంతులతో ప్రజలు చికెన్, గుడ్లు తినేందుకు బయపడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోడిమాంసం, కోడిగుడ్లు బాగా ఉడికించి తినడం వలన మనుషుల ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని పేర్కొన్నారు. ప్రజలందరికీ చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ మేళాను ఏర్పాటు చేశామని చెప్పారు. చికెన్‌తో మంచి ప్రొటీన్‌తో పాటు, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని వైద్య నిపుణులు శాస్త్రీయంగా చెబుతున్నారన్నారు. ఇదే విషయం కరోనా సమయంలో కూడా నిరూపితమైందన్నారు. అల్వాల్ చికెన్‌షాపు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్.నరేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మహేష్, సిరాజుద్దీన్, మహిపాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, బలవంతరెడ్డి, నాగేశ్వరరావు, అల్వాల్ చికెన్‌షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు


మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

కీసర: మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం సాయంత్రం కీసరగుట్టలో సివిల్, ట్రాఫిక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతాపరమైన పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని, జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీమ్ బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ, డీసీపీ క్రైం అరవింద్‌బాబు, ఐటీసెల్ ఏసీసీ నరేందర్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై ఫిర్యాదు !

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అనుమతులు లేని నిర్మాణాలపై మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించడం లేదని స్థానికుడు బొక్క కష్టారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. సర్వేనెంబర్ 1140, 1141లోని 2000 గజాల్లో అనుమతి లేకుండా పిల్లర్ల స్థాయిలో పనులు జరుగుతుండగా ఫిర్యాదు చేశామని, సగం మేర పనులు పూర్తయిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నిర్మాణాలపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.